సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం। 27। సెప్టెంబర్। 2025



బాలకృష్ణా.. నోరు జారితే ఊరుకోం

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కేంద్ర మాజీ మంత్రి, సినీ హీరో చిరంజీవిపై నోరు జారితే ఊరుకోబోమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హెచ్చరించారు. -8లో



సూపర్ సిక్స్ అట్టర్ ప్లాఫ్

సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి అట్టర్ ప్లాఫ్ అయిందని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి విమర్శించారు. శాసన మండలిలో ఆయన శుక్రవారం మాట్లాడారు. -8లో

గరిష్టం/కనిష్టం
26.6/25.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 25.4 - 26.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అగ్రిసెట్‌లో 25వ ర్యాంకు



సుహాసిని

కడప ఎడ్యుకేషన్: తాజాగా విడుదలైన అగ్రికల్చర్ కామన్ ఎంట్రెన్స్ టెస్టులో (అగ్రిసెట్) జిల్లా విద్యార్థిని చిట్టిబోయిన సుహాసిని రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంకు సాధించింది. ఖాజీపేట మండలం భూమాయపల్లెలోని రైతు చిట్టిబోయిన వెంకటరమణ, మహేశ్వరి కుమార్తె సుహాసిని. సుహాసిని రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా శివారెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన పోతుల శివారెడ్డిని రాష్ట్ర కార్యదర్శి (కేంద్ర కార్యాలయం)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోతుల శివారెడ్డి చెన్నూరు మండలం ఓబులంపల్లెకు చెందిన నాయకుడు. గతంలో ఆయన ఐటీ విభాగంలో రాష్ట్ర కార్యదర్శిగా సేవలు అందించారు.

రాష్ట్ర లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుదర్శన్‌రెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన జల్లా సుదర్శన్‌రెడ్డిని రాష్ట్ర లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ పొందడానికి రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 31 వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ సాంబశివారెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వారు పేర్కొన్నారు. 14 ఏళ్లు నిండిన వారు పదో తరగతి, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఇంటర్‌ను ఒకే సంవత్సరంలో పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు స్వయంగా ఇంటర్నెట్, మీసేవా, ఏపీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం www.apo penschool.ap.gov.in వెబ్‌సైట్ లేదా మీ సమీపంలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో కానీ డీఈఓ కార్యాలయంలో గానీ సంప్రదించాలని వివరించారు.

రేపు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠంలోని శ్రీ విరాట్ విశ్వకర్మ భవన్‌లో ఆదివారం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణుల సమస్యలు, డిమాండ్లపై చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. శ్రీశైలంలోని విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం నిర్వహణపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే అన్ని దేవస్థానాల్లోని విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం నిర్వహణపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం మఠాధిపతి ఎంపికపై తమ అభిప్రాయాలు తెలియజేస్తామన్నారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్ మధుసూధనాచారి, తెలంగాణ ఏసీపీ కిరణ్‌కుమార్, హైదరాబాద్ అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ ఇ.వెంకటాచారి, ఏపీ విశ్వబ్రాహ్మణ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ తదితరులు విచ్చేస్తారన్నారు. కావున విశ్వబ్రాహ్మణులు పెద్ద ఎత్తున పాల్గొని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దేదీప్యం.. దేవీ వైభవం



కడపలో శ్రీ రాజరాజేశ్వరీదేవిగా లలితాంబిక



కడప అమ్మవారిశాలలో మోహినీ అవతారంలో వాసవికన్యకాపరమేశ్వరిదేవి

'దుష్టశిక్షణ.. శిష్టరక్షణ' కోసం అమ్మవారు అనేక అవతారాలు ధరించారు. వాటిలో కొన్నింటికి విశేష చరిత్ర ఉంది. జగన్మాత రూపాలను దేవీ శరన్నవరాత్రుల్లో ఒక్కో రోజు ఒక్కో అలంకారంలో పూజించడం సంప్రదాయంగా వస్తోంది. జిల్లా వ్యాప్తంగా దసరా ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజైన శుక్రవారం లోకమాత ఒక్కో ప్రాంతంలో ఒక్కో అలంకరణలో దర్శనమిచ్చారు. రంగురంగుల పూలు, విద్యుత్ దీపాల వెలుగుతో ఆలయాలు శోభాయమానంగా మారాయి. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలతో కిటకిటలాడుతున్నాయి. దేవీ వైభవం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. శక్తి స్వరూపిణిని భక్తులు కనులారా దర్శించుకుని పులకించిపోయారు. 'జగజ్జనని.. లోకపావని' అంటూ శరణు వేడారు. 'కొలిచే వారి కొంగు బంగారమై నిలిచే తల్లీ.. మమ్మల్ని చల్లంగా చూడు' అంటూ భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.

– సాక్షి, నెట్‌వర్క్



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో శ్రీదేవి వనవిహారిణి



ప్రొద్దుటూరు వాసవీమాతను దర్శించుకుంటున్న భక్తులు




ప్రొద్దుటూరు చెన్నకేశవస్వామి ఆలయంలో మోహిని వనవిహారిణిగా అమ్మవారు



కడప సత్యదేవుని ఆలయంలో మహిళా భక్తుల కోలాటం

తవ్వేది కొండంత.. జరిమానా గోరంత

- అధికారమే అండగా చెలరేగుతున్న తమ్ముళ్లు
- యథేచ్ఛగా అక్రమ మైనింగ్
- గ్రావెల్ పర్మిట్లు లేకపోయినా తరలింపు
- ఆరోపణలు వచ్చినప్పుడు తూతూమంత్రంగా తనిఖీలు
- నామమాత్రం పెనాల్టీతో సరిపెడుతున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, కడప: మైనింగ్ నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు అవసరం లేదు. తెలుగుదేశం పార్టీ నాయకుల అండ ఉంటే చాలు. ఎవరు ఎక్కడ ఎలాంటి అక్రమ మైనింగ్‌కు పాల్పడినా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడరు. అక్రమ మైనింగ్ నిర్వహణలో వ్యక్తులు చనిపోయినా సరే, యథేచ్ఛగా కొనసాగించవచ్చు. మహా అయితే గోరంత జరిమానా వేస్తే, కొండంత మైనింగ్ చేసుకోవచ్చు. జిల్లాలో దోపిడీ రాజ్యం నడుస్తోంది. తువ్వుకున్నోడికి తువ్వుకున్నంత అన్నట్లుగా సాగుతున్నా.. మైనింగ్ అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారు.

అనుమతులు లేకపోయినా..

జిల్లా కేంద్రమైన కడప పరిసర ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారికంగా గ్రావెల్ మైనింగ్‌కు అనుమతులు లేకపోయినా.. అనధికార గ్రావెల్ మైన్స్ తెలుగు తమ్ముళ్ల నేతృత్వంలో నడుస్తున్నాయి. నిత్యం లక్షలాది రూపాయలు గ్రావెల్ ద్వారా సొమ్ము చేసుకుంటున్నారు, తప్పితే ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ ఖజానాకు చేరడం లేదు. అధికారం అడ్డుపెట్టుకొని ప్రజాధనం లూటీ చేస్తున్నారు. ఆరోపణలు వచ్చినప్పుడు అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్వల్పంగా జరిమానా వేస్తూ చేతులు దులుపుకొంటున్నారు. 2024-25లో కడపలో 23 కేసులు నమోదు చేసి రూ.1.44 లక్షల జరిమానా వసూలు చేశారు. 2025-26లో ఏప్రిల్, మే నెలలో ఎలాంటి కేసులు నమోదు కాలేదు. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో 21 కేసులు నమోదు చేసి రూ.2.43 లక్షలు వసూలు చేశారు. నిత్యం లక్షలాది రూపాయలు అక్రమ మైనింగ్, ప్రత్యేకించి గ్రావెల్ ద్వారా కడపలో తెలుగు తమ్ముళ్లు లబ్ధి పొందుతుంటే.. మైనింగ్ అధికారులు నమోదు చేసిన కేసుల ద్వారా ప్రభుత్వానికి జమ అయిన మొత్తం ఇప్పటి వరకు రూ.3.87లక్షలు మాత్రమే కావడం గమనార్హం. కొండలు గుల్ల అయ్యాయి. గుట్టల ఆనవాళ్లు కనుమరుగయ్యేలా గ్రావెల్ తరలించుకుపోయారు. అయినప్పటికీ మైనింగ్ అధికారులు నామమాత్రపు చర్యలకే పరిమితమయ్యారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాలోనూ అదే తంతు..

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాలోనూ మైనింగ్ అధికారులు ఉదాసీనతతో ఉన్నారు. అధికారిక ఇసుక రీచ్‌లతో నిమిత్తం లేకుండా అనధికారికంగా ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసుకొని ప్రధాన పట్టణాలు, నగరాలకు తరలించుకుపోతున్నారు. పాపాఘ్ని, పెన్నా, చెయ్యేరు, చిత్రావతి నదుల కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఉచిత ఇసుక మాటున దోచుకుంటున్నారు. కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, రాజంపేట నియోకవర్గాల్లో తెలుగు తమ్ముళ్లు భారీగా లబ్ధి పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రకృతి సంపదను అక్రమ మైనింగ్ ద్వారా కొల్లగొట్టుతున్నా, చేష్టలుడిగి చూస్తుండిపోవడం మినహా కట్టడి చేయాలనే దృక్పథంతో అధికారులు వ్యవహరించడం లేదనే విమర్శలు బలంగా ఉండటం గమనార్హం.

రూ.కోట్ల విలువైన బెరైటీస్ కొల్లగొట్టి..

పులివెందుల నియోజకవర్గంలోని వేముల, గొందిపల్లె, తాళ్లపల్లె, కత్తులూరు, కొత్తపల్లె ప్రాంతాల్లో బెరైటీస్ నిల్వలు ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో తెలుగుతమ్ముళ్లు యథేచ్ఛగా అక్రమ మైనింగ్ కొనసాగిస్తున్నారు. వేముల కేంద్రంగా ఈ తంతు అధికంగా నడుస్తోంది. టిఫెన్ బెరైటీస్ సంస్థ ఎన్సీఎల్టీ ద్వారా కొనుగోలు చేసి నిల్వ చేసుకొని ఉన్న కోట్లాది రూపాయాల విలువైన ఖనిజాన్ని.. ఒక్క రాత్రిలో పదుల సంఖ్యలో టిప్పర్లు పెట్టి తరలించుకుపోయారు. పెద్ద స్థాయిలో లూటీ చేసినా నామమాత్రపు చర్యలు కూడా లేవు. మరోవైపు వేంపల్లె మండలం కత్తులూరు కేంద్రంగా కొనసాగిస్తున్న అక్రమ మైనింగ్ నిర్వహణలో.. అమ్మయ్యగారిపల్లెకు చెందిన చిట్టిబోయిన రామచంద్ర(52) మృతి చెందారు. అయితే ట్రాక్టర్ ప్రమాదంలో చనిపోయినట్లు చిత్రీకరించారు. పోలీసులే మధ్యవర్తిత్వం వ్యవహరించి కేసు మమ అనిపించారు. ఈ వ్యవహారంలో టీడీపీ నేత సమీప బంధువు ఉండటంతోనే.. పోలీసులు అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని కప్పి పుచ్చినట్లు సమాచారం. బెరైటీస్ అక్రమ మైనింగ్ వ్యవహారంపై 2024-25లో 15 కేసులు నమోదు చేసి రూ.7.46 లక్షల జరిమానా వసూలు చేశారు. 2025-26లో 31 కేసులు నమోదు చేసి రూ.24.07 లక్షలు వసూలు చేశారు. ఇప్పటికి 280 మెట్రిక్ టన్నుల బెరైటీస్‌ను సీజ్ చేశారు. అనధికారికంగా 41 చోట్ల ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం.

అట్టహాసంగా ఇన్‌చార్జి మేయర్ బాధ్యతల స్వీకరణ

పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సురేష్‌బాబు, అంజద్‌బాషా



మేయర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ముంతాజ్‌బేగం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్‌గా ముంతాజ్ బేగం బాధ్యతల స్వీకరణ అట్టహాసంగా జరిగింది. శుక్రవారం సాయంత్రం 5.27 గంటలకు కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆమెతో సంతకాలు చేయించి బాధ్యతలు అప్పగించారు. అంతకుముందు ముంతాజ్‌బేగం స్వగృహం ఉన్న రవీంద్రనగర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించి, అపూర్వ కల్యాణ మండపంలో మాజీ మేయర్ సురేష్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడి నుంచి నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకొని బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి మేయర్‌గా ఎంపికైన ముంతాజ్ బేగంను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముంతాజ్ బేగం మాట్లాడుతూ మాజీ మేయర్ సురేష్ బాబుపై అనర్హత వేటు వేయడం బాధాకరమన్నారు. కడప నగరాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు పంచుకున్నారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా కార్పొరేషన్ వద్ద పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమైర్ తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జమాల్ వలీ, డాక్టర్ మురాద్, కార్పొరేటర్లు మగ్బూల్‌బాషా, షంషీర్, మల్లికార్జున, బాలస్వామిరెడ్డి, కె.బాబు, డివిజన్ ఇన్‌చార్జులు రెడ్డి ప్రసాద్, బసవరాజు, రామచంద్రయ్య, సుబ్బరాయుడు, డిష్‌జిలాన్, కో ఆప్షన్ సభ్యురాలు పత్తిరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ముంతాజ్‌బేగంను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు, ప్రజాప్రతినిధులు

తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్'పై నెల రోజుల పాటు నిర్వహించాల్సిన సెలబ్రేషన్స్, సీజనల్ కండీషన్స్, పీఎం కుసుమ్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు, సోలార్, విండ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితోపాటు జేసీ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, జిల్లా సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ నోడల్ అధికారి జి. సుమతి, కేఎంసీ కమిషనర్ మనోజ్‌రెడ్డి, మెప్మా పీడీ కిరణ్ కుమార్ హాజరయ్యారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మారిన ధరల విషయంపై ప్రజలకు తెలియజేయాలన్నారు. 4 వారాల షెడ్యూల్‌ను సవివరంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి జీఎస్టీ తగ్గింపు, తగ్గింపు వల్ల సేవింగ్స్‌పై ప్రజలకు వివరంగా తెలియజేయాలని ఆదేశించారు. జీఎస్టీపై పోస్టర్లు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు నాలుగు వారాలకు సంబంధించి చేయపట్టాల్సిన కార్యక్రమాల షెడ్యూలును తెలియజేశారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. నూతన జీఎస్టీ ద్వారా ఆదా అయ్యే అమౌంట్ గూర్చి ప్రజలకు తెలియజేయాలని, ఈ తగ్గిన జీఎస్టీ ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు కొంత మేర డబ్బులు ఆదా అవుతాయన్నారు. నాలుగు శ్లాబులు నుంచి రెండు శ్లాబులుగా ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీపై ముఖ్యంగా గ్రామ సచివాలయాలు, స్వయం సహాయక సంఘాలు గ్రామ స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

చిన్నయ్యా.. మార్పు ఏదయ్యా!

- రేషన్ డీలర్ విషయంలో హైకోర్టుకు పులివెందుల ఆర్డీఓ క్షమాపణ
- క్షేత్రస్థాయిలో మాత్రం కూటమి నేతలు చెప్పినట్టే నడుస్తున్న యంత్రాంగం



సాక్షి ప్రతినిధి, కడప: అధికార పార్టీ సిఫార్సులకు తలొగ్గి, నిబంధనలకు విరుద్ధంగా.. రేషన్‌షాపు డీలర్లపై చర్యలు తీసుకుంటున్నారు. రెవెన్యూ విధానాలను అనుసరించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. హైకోర్టు చీవాట్లు పెట్టినా... రెవెన్యూ అధికారులు నీళ్ల నమిలి క్షమాపణ చెప్పినా.. క్షేత్రస్థాయిలో మాత్రం కూటమి మార్కు విధానాలనే అనుసరిస్తున్నారు. తాజాగా భద్రంపల్లె రేషన్‌షాపు డీలర్ సుభాషిణి సస్పెన్షన్ విషయంలో ఆర్డీవో చిన్నయ్య మళ్లీ అవే తప్పులు కొనసాగించారు.

విచారణ లేకుండా.. నోటీసు సైతం ఇవ్వకుండా..

పులివెందుల ఆర్డీవో చిన్నయ్య రేషన్‌షాపు డీలర్లను సస్పెండ్ చేయగా.. పలువురు హైకోర్టును ఆశ్రయించారు. కనీస విచారణ లేకుండా.. నోటీసు కూడా ఇవ్వకుండా డీలర్‌షిప్‌లను రద్దు చేయడాన్ని హైకోర్టు అడ్వకేట్ నరహరి న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించిన హైకోర్టు వ్యక్తిగతంగా ఆర్డీవో తన ఎదుట హాజరు కావాలని ఉత్తర్వులిచ్చింది. కోర్టులో హాజరైన ఆర్డీవో చిన్నయ్యను రెవెన్యూ నిబంధనలను అనుసరించకపోవడంపై న్యాయమూర్తి ప్రశ్నించగా.. ఆయన నీళ్ల నమిలారు. చివరకు హైకోర్టుకు ఆర్డీవో చిన్నయ్య క్షమాపణ చెప్పారు. ఇదంతా గత వారంలో చోటుచేసుకుంది. తాజాగా సదరు ఆర్డీవో చిన్నయ్య అవే తప్పులు చేయడం గమనార్హం. ఈనెల 9న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో భద్రంపల్లె రేషన్ డీలర్ సుభాషిణి వద్ద నిర్ణీత పరిణామం కంటే 68 కిలోల బియ్యం, 45 కిలోల చక్కెర తక్కువగా ఉన్నట్టు గుర్తించి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు నివేదిక ఇచ్చారు. దీంతో డీలర్‌పై చర్యలకు తొండూరు తహసీల్దార్ పులివెందుల ఆర్డీవోకు సిఫార్సు చేశారు. వెంటనే పులివెందుల ఆర్డీవో ఈనెల 17న భద్రంపల్లె రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



సస్పెన్షన్ తర్వాత షోకాజ్ నోటీసు

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక, మండల రెవెన్యూ అధికారి సిఫార్సుల నేపథ్యంలో డీలర్‌పై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలని కోరుతూ ఆర్డీవో షోకాజ్ నోటీసు జారీ చేయాల్సి ఉంటుంది. అనంతరం అధికారి విచక్షణాధికారంతో చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే, భద్రంపల్లె డీలర్‌ను సస్పెండ్ చేస్తూ ఈనెల 17న ఆదేశాలు జారీ చేశారు. అనంతరం 18వ తేదీ వేసి 24వ తేదీన సాయంత్రం షోకాజ్ నోటీసు అందజేశారు. పైగా షోకాజ్ నోటీసులో 24వ తేదీ సాయంత్రం లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అంటే రేషన్ డీలర్ వివరణ ఇచ్చే అవకాశమే లేకుండా రెవెన్యూ యంత్రాంగం కుయుక్తులు పన్నినట్టు అవగతమవుతోంది. ఇదివరకే ఆర్డీవోకు హైకోర్టు చీవాట్లు పెట్టినా.. ప్రొసీజర్స్ ఫాలో కావాలని స్పష్టంగా ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం తమకు నచ్చినట్టు ఉత్తర్వులు ఇస్తామని రెవెన్యూ యంత్రాంగం తీరు స్పష్టం చేస్తోంది. గత వారంలో హైకోర్టుకు క్షమాపణ చెప్పిన ఆర్డీవో మళ్లీ అవే తప్పులు చేయడం వెనుక.. అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్టు పలువురు చెబుతున్నారు.

క్లుప్తంగా

పొలాల్లో మృతదేహం


పొలాల్లో మృతదేహం

జమ్మలమడుగు : మండలంలోని సుగుమంచిపల్లె పొలాల్లో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. మరణించిన వ్యక్తి ప్రొద్దుటూరు వాసి శివకుమార్(36) గుర్తించారు. శివకుమార్ అనారోగ్యానికి గురై తాగుడుకు బానిస కావడంతో ఎక్కడపడితే అక్కడ తిరుగుతుంటాడని బంధువులు తెలిపారు. అయితే పంట పొలాల్లో విగతజీవిగా పడి ఉండడంపై వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విచారణలో వివరాలు తెలియాల్సి ఉంది. సోదరుడు సంపత్ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో రిటైర్డ్ ఆర్మీ అధికారి మృతి


ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న సిబ్బంది


లక్ష్మిరెడ్డి (ఫైల్)

చాపాడు : మండలంలోని చెంచుపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ అధికారి మూల లక్ష్మిరెడ్డి(55) గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతిచెందారు. బంధువుల వివరాల మేరకు.. ఆర్మీలో వివిధ కేడర్లలో పనిచేసిన లక్ష్మిరెడ్డి మూడేళ్ల కిందట పదవీ విరమణ పొంది ప్రొద్దుటూరులో నివాసముంటున్నారు. ఇంటివద్ద కొళాయి మోటారుకు మరమ్మతులు చేపడుతూ ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా కలికిరి వద్ద ఉన్న రిటైర్డ్ ఆర్మీ సిబ్బందికి బంధువులు తెలియజేయడంతో ఆర్మీ అధికారులు వచ్చి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా వారికి వివాహమైంది. కుమారుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. రిటైర్డ్ ఆర్మీ అధికారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆపరేటర్‌పై దాడి

కడప అర్బన్ : కడప నగర శివారులోని నానాపల్లి వద్ద మట్టి తవ్వకాల్లో రెండు రోజుల కిందట జరిగిన ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేశారు. పాత కడప సర్పంచ్ కష్టారెడ్డి వర్గానికి చెందిన జేసీబీ ఆపరేటర్ వరప్రసాద్‌పై కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి వర్గీయులైన కొందరు విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన వరప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కడప తహసీల్దారు ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు రాజగోపాల్‌రెడ్డితో పాటు పలువురిపై చిన్న చౌక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిపై కుక్కల దాడి


కుక్క కాటుకు గురైన శార్దిక్‌రెడ్డి

సిద్ధవటం : ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని జ్యోతి గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపుగా తిరుగుతూ ప్రజలను చుట్టుముట్టి కరుస్తున్నాయి. శుక్రవారం చిన్నారి శార్దిక్‌రెడ్డి(4)పై విచక్షణా రహితంగా దాడిచేశాయి. మెరుగైన వైద్యం కోసం బాలుడి తల్లిదండ్రులు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. రాత్రి వేళల్లో వాహనాల వెంబడి పరుగులు తీస్తున్నాయని, అధికారులు స్పందించి శునకాలను పట్టి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

బాలకృష్ణా.. చిరంజీవిపై
నోరు జారితే ఊరుకోం

బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడిన తీరుపై ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. చిరంజీవిపై ఆయన చేసిన వ్యాఖ్యలపై పలువురు నాయకులు స్పందించారు. సీనియర్ నటుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

→ అబద్ధాలు చెబుతున్నారు



సినీ నటుడు బాలకృష్ణ (బాలిగాడు) మరో మారు నోరు జారితే చూస్తూ ఊరుకోం. చిరంజీవితో పాటు చిత్ర పరిశ్రమ పెద్దలు కలిసినప్పుడు సీఎం హోదాలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా వారి సమస్యలు విని పరిష్కరించారు. ఇది తెలియని బాలకృష్ణ చిరంజీవిని అగౌరవపరిచేలా అబద్ధాలు చెబుతున్నారు. మాన్సన్ హౌస్ మందు తాగి హౌస్ (అసెంబ్లీ)లోకి వెళ్లి జులాయిలా, పోకిరిలా తలపై అద్దాలు పెట్టుకుని మాట్లాడడం సబబు కాదు. గతంలో జగన్ చేసిన సాయాన్ని అప్పుడే మరిచిపోయావు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి కోట్ల రూపాయల బకాయిలు జగన్ తీర్చారు. తన తండ్రికి వెన్నుపోటు పొడిచిన వారికి, తండ్రిపై చెప్పులు వేయించినవారిని మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదు. జగన్‌ను తూలనాడి మాట్లాడితే నీ పేరు కూడా డిజిటల్ బుక్‌లో ఉంటుంది.

– మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

→ చికిత్స చేయించుకో..



20 ఏళ్ల కిందట బాలకృష్ణకు మెంటల్ ఉందని వైద్యులు సర్టిఫికెట్ ఇచ్చారు. ఆయన సరైన చికిత్స చేయించుకోవడం లేదు. దీంతో ఆయన పిచ్చి పీక్స్‌కు చేరింది. రెండు రోజుల కిందట అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన మాటలనుబట్టి రాష్ట్ర ప్రజలకు ఆయన వైఖరి స్పష్టంగా అర్థమైంది. బెల్లంకొండ సురేష్‌పై అతడు కాల్పులు జరిపినప్పుడు దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి దయచూపారు.. ఇలాగే వదిలేస్తే అసెంబ్లీలో తోటి ఎమ్మెల్యేలు, మంత్రులపై చేయిచేసుకునే అవకాశం లేకపోలేదు. ప్రజాస్వామ్యంలో మర్యాద ఇచ్చి పుచ్చుకోవడం చాలాముఖ్యమని టీడీపీ నాయకులు గుర్తుంచుకోవాలి.

– దండుగోపి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్రకార్యదర్శి

→ బాలకృష్ణ దిగజారుడు తనానికి నిదర్శనం



సినీ నటుడు బాలకృష్ణ పూర్వాపరాలను అసెంబ్లీలో దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచితంగా మాట్లాడటం సరికాదన్నారు. నాడు సినీ పరిశ్రమ సమస్యలపై ఇంటికి వచ్చిన చిరంజీవి తదితర సినీ నటులను ఆప్యాయంగా పలుకరించి వారి సమస్యల పరిష్కారానికి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారు. దానిని వక్రీకరించి కూటమి నేతలు వైఎస్ జగన్ పటిష్టతను దెబ్బ తీసేలా వ్యవహరించడం దారుణం. ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెట్టి ఆయనను గౌరవిస్తే ఆయన కుమారుడైన బాలకృష్ణ జగన్ మోహన్‌రెడ్డిని తూలనాడడం సరికాదు. సభలో లేని, సభకు సంబంధం లేని సినీ నటుడు చిరంజీవిని బాలకృష్ణ పరోక్షంగా తూలనాడుతున్నా జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యతిరేకించలేకపోవడం బాధాకరం. బాలకృష్ణ వెంటనే చిరంజీవికి క్షమాపణలు చెప్పాలి.

– ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ

అసెంబ్లీ సాక్షిగా అహంకార ప్రదర్శన




హిందూపురం ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, బావమరిది బాలకృష్ణ అసెంబ్లీ సాక్షిగా అహంకార ప్రదర్శన చేశారు. మాజీ ఎమ్మెల్యే చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య. అసెంబ్లీని తెలుగుదేశం పార్టీ తమ పార్టీ ఆఫీసుగా మార్చుకుని ఇష్టం వచ్చినట్లు వరుష పదజాలాన్ని వాడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగనన్న ఏరోజూ సినీ పరిశ్రమ పెద్దలను అగౌరపరచలేదు. చిరంజీవిని సతీసమేతంగా ఇంటికి ఆహ్వానించి జగనన్న దంపతులు గౌరవ మర్యాదలు చూపారు. శాలువాతో సత్కరించి ఆప్యాయంగా వారితో కలిసి భోజనం చేశారు. సినీ పరిశ్రమకు సంబంధించిన కొన్ని సమస్యలను చిరంజీవి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తెస్తే ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం మరోసారి చిరంజీవి, ఇతర నటులు, నిర్మాతలు కలిస్తే వారి సమస్యలపట్ల సానుకూలంగా స్పందించారు. అప్పటి సీఎం స్పందించడంతోనే బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి, చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమా టికెట్ల రేట్లు పెంచుకున్నారు. అసెంబ్లీలో బాలకృష్ణ వ్యాఖ్యలను చిరంజీవి ఖండిస్తూ బహిరంగ లేఖ విడుదల చేశారు. బాలకృష్ణ తరచూ మానసిక రోగిలా ప్రవర్తిస్తున్నారు. నీచ పదజాలం వాడుతున్న బాలకృష్ణకు మతి భ్రమించినట్లుగా ఉంది.

– కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్

శాసన మండలిలో ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : సూపర్ సిక్స్ పథకాల అములులో కూటమి ప్రభుత్వం సూపర్ ఫ్లాప్ అయ్యిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి విమర్శించారు. శాసన మండలిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఆ పథకం కింద ప్రైవేటు పాఠశాలలకు నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.70 కోట్ల నిధులను ఇంతవరకూ విడుదల చేయలేదన్నారు. ఈ నిధులు రాక ప్రైవేటు యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌తోపాటు 143 హామీలిచ్చిన ప్రభుత్వం వాటిని సక్రమంగా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐఆర్, పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయలేదన్నారు. 16 నెలల్లో నిరు పేదలకు ఒక్క ఇల్లు కట్టించలేదని, పేదలకు ఆరోగ్యభరోసా ఇచ్చే ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. యూరియా లేక గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.15వేల కోట్ల భారం వేశారన్నారు. కూటమి పాలనలో ప్రజలకు ఏమీ చేయకపోగా ప్రజలపై అదనపుభారం వేసి నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తొలి ఏడాదిలోనే 90 శాతం సంక్షేమ పథకాలు అమలుపరిచారన్నారు. వైఎస్ జగన్ అమలుపరిచిన అమ్మ ఒడికి పేరు మార్చి తల్లికి వందనం అమలు చేశారని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.15వేలు ఇస్తామని, రూ.13వేలే ఇచ్చారన్నారు. కొందరికి రూ.8వేలు, రూ.9వేలు పడిందన్నారు. 30లక్షల మందికి కోత విధించారన్నారు. అన్నదాత సుఖీభవ విషయంలోనూ మోసం చేశారన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందడం లేదని, మామిడి, చీని, ఉల్లి, వరి పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. స్త్రీ శక్తి పథకానికి సంబంధించి ఐదు రకాల సర్వీసుల్లో ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతిస్తున్నారన్నారు. 20లక్షల ఉద్యోగాలు లేదా నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వలేదన్నారు. ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని చెప్పారని, మెరుగైన పీఆర్సీ ఇవ్వాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాక విద్యార్థులతోపాటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు రోడ్డెక్కే పరిస్థితి ఉందని తెలిపారు.

మొక్కలు నాటిన ఎస్పీ

కడప అర్బన్ : స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల(ఎస్‌సీటీపీసీ)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివారులోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని (డీటీసీ) కడప ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ శుక్రవారం సందర్శించారు. కేంద్రంలోని వసతి ఏర్పాట్లు, తరగతి, కార్యాలయ గదులు, మైదానం, అంతర్గత రహదారులను పరిశీలించారు. అనంతరం డీటీసీ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ(పరిపాలన) కె.ప్రకాష్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, సిబ్బంది ఉన్నారు.


మొక్కకు నీరు పోస్తున్న ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

యర్రగుంట్ల మున్సిపాల్టీలో వార్డుల పెంపు

ఇక నుంచి 27 వార్డులు


మాట్లాడుతున్న చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పురపాలక సంఘం పరిధిలో మరో ఏడు వార్డులను పెంచేందుకు డీఎంఏ(డైరెక్ట్ మున్సిపాలిటీ ఆథారిటీ) ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ శేషఫణి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుతం మున్సిపాల్టీలో 20 వార్డులు ఉండగా, 32572 మంది నివసిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఈ సంఖ్య ఇంకా పెరిగి ఉండవచ్చునని భావిస్తున్నామని తెలిపారు. ఇపుడు మున్సిపాలిటీలో ఏడు వార్డులు అదనంగా పెంచుతున్నట్లు ఉత్వర్వులు వచ్చాయని ఆయన తెలిపారు. ఎవరికైనా అభ్యర్థనలుంటే అక్టోబరు ఆరో తేదీలోగా మున్సిపాలిటీలో స్వీకరిస్తామని, 8వ తేదీలోగా పూర్తి నివేదిక కలెక్టర్‌కు పంపిస్తామని పేర్కొన్నారు. 10న డీఎంఏ (డెరెక్ట్ మున్సిపాలిటీ ఆథారిటి)కి పంపిస్తామని, 12న ప్రభుత్వానికి పంపగా, 14న జీవో విడుదల అవుతుందని తెలిపారు. యర్రగుంట్ల పురపాలక సంఘంలో 27 వార్డులు ఏర్పాటుకానున్నాయని, ఓటరు శాతం ప్రకారం ఒక్కో వార్డుకు 850కి తక్కువ కాకుండా విభజించాల్సి ఉంటుందని తెలిపారు. వార్డుల విభజనపై టీఎంపీ విభాగం కసరత్తు ప్రారంభించారని, 1 నుంచి 20వ వార్డు వరకు అన్నింటినీ పరిశీలించి విభజిస్తామని పేర్కొన్నారు.

అత్యుత్తమ పరిశోధకుల జాబితాలో ఎల్‌వీపీఈఐ


ర్యాంకింగ్స్‌లో స్థానం పొందిన ఎల్‌వీపీఈఐ వైద్య బృందం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతిష్టాత్మక 2025 స్టాన్‌ఫోర్డ్/ఎల్సెవియర్ టాప్-2 సైంటిస్ట్ జాబితా ప్రామాణిక సైటేషన్ మెట్రిక్స్ ఆధారంగా ప్రపంచంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పరిశోధకుల జాబితా విడుదలైంది. ఎల్‌వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్‌వీపీఈఐ) మరోసారి ప్రపంచ నాయకత్వాన్ని ప్రదర్శించిందని ఆ వైద్యశాల హెడ్ డాక్టర్ కావ్యమాధురి బెజ్జంకి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఏడుగురు ఎల్‌వీపీఈఐ అనుబంధ క్లినిషియన్ శాస్త్రవేత్తలు జీవితకాల ర్యాంకింగ్స్‌లోనూ, 15 మంది 2025 వార్షిక ర్యాంకింగ్స్‌లోనూ చోటు దక్కించుకున్నారని చెప్పారు. ఎల్‌వీపీఈఐ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గుళ్లపల్లిఎస్.రావు భారతదేశంలోనే నేత్ర వైద్య రంగంలో జీవితకాల ర్యాంకింగ్‌లో రెండవ స్థానంలో నిలిచారన్నారు. ఆయతోపాటు మరో ఆరుగురు పరిశోధకులు సావిత్రిశర్మ, ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యన్ మహ్మద్ జావిద్ అలీ, ప్రశాంత్ గర్గ్, తారాప్రసాద్ దాస్, స్వాతి ఉత్తమ ర్యాంకుల జాబితాలో ఉన్నారని చెప్పారు. 2025 సంవత్సరానికిగానూ వార్షిక ర్యాంకింగ్స్‌లో మహ్మద్ జావిద్ అలీ, స్వాతి కలికి, సావిత్రి శర్మ, ప్రశాంత్ గర్గ్, సయన్ బసు, రోహిత్ ఖన్నా, గుళ్ళపల్లి ఎస్.రావు, స్వాతి సింగ్, తారాప్రసాద్ దాస్, ఎలిజబెత్ కీఫ్, వివేక్ సింగ్, పవన్ కుమార్ వెర్కిచర్ల, ప్రొఫెసర్ బాలసుబ్రమణియన్, మిలింద్ నీలకంఠ నాయక్, సుభద్ర జలాలిలు జాబితాలో చోటు సంపాదించారని తెలిపారు.

జేఎన్‌టీయూలో యంత్ర 2025 జాతీయ సదస్సు


యంత్ర 2025ను ప్రారంభిస్తున్న ప్రముఖులు

పులివెందుల టౌన్ : స్థానిక జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో శుక్రవారం యంత్ర 2కె25 మూడు రోజుల విద్యార్థుల జాతీయ సదస్సును ఘనంగా ప్రారంభించారు. యూసీఐఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రభాస్‌రంజన్, న్యూటెక్ బయోసైన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ వసంత్‌కుమార్, విశాఖపట్టణం పోర్ట్ అథారిటీ గ్రేడ్-1 అసిస్టెంట్ సెక్రటరీ అజయ్‌తేజా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి 500మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభాస్‌రంజన్ మాట్లాడుతూ మానవుడి జీవితంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), చాట్ జీపీటీ ప్రాముఖ్యత, దాని ప్రయోజనాలు వివరించారు. అనంతరం విశిష్ట అతిథులు ఇంజినీరింగ్ ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపల్ ఎం.శేషమహేశ్వరమ్మ, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి


చిన్నారులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార్ గుప్తా, తదితరులు

పులివెందుల టౌన్ : విద్యార్థులు సృజనాత్మకతతో జాతీయస్థాయిలో సత్తా చాటాలని ఆర్డీఓ చిన్నయ్య అన్నారు. స్థానిక న్యాక్ బిల్డింగ్ సమీపంలో న్యూఢిల్లీ యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఆర్డీఓ చిన్నయ్య మాట్లాడుతూ యుఎస్ఓ లాంటి ఎన్జీవో సంస్థలు దేశవ్యాప్తంగా విద్యార్థి సమగ్ర సంపూర్ణ వ్యక్తిత్వానికి సహకారం అందించి సఫలీకృతం అవుతున్నారని ప్రశంసించారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార్‌గుప్తా మాట్లాడుతూ యుఎస్ఓ జాతీయ స్థాయి పోటీలను పులివెందులలో నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థులు చదువుకు మాత్రమే పరిమితం కాకుండా పోటీ ప్రపంచంలో కావాల్సిన అన్ని నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. సెక్రటరీ జనరల్ నీనాజైన్ మాట్లాడుతూ పది రాష్ట్రాల నుంచి దాదాపు 158 మంది చిన్నారులు పాల్గొని అన్ని రాష్ట్రాల సంస్కృతులు, అలవాట్లను తెలుసుకుంటారని తెలిపారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దాసరి భానుప్రకాష్, సునీల్‌కుమార్, త్యాగరాజన్, విజయ్‌కుమార్, మిశ్రా నిఖిల్, రాజేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఒకరు దుర్మరణం


మృతిచెందిన రాము(42)


ప్రాణాలతో బయటపడిన జగదీష్

రామాపురం/లక్కిరెడ్డిపల్లి : కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంలో అత్తారింటికి బయలుదేరిన రాము (42) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం దుర్మరణం పాలయ్యారు. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ వడ్డెపల్లికి చెందిన రాము తన కుమారుడు జగదీష్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో రామాపురం బయలుదేరారు. కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి మార్గంలో రామాపురానికి కూతవేటు దూరంలో మరో ద్విచక్ర వాహనం వీరి వాహనాన్ని ఢీకొంది. రోడ్డుమీద పడిన రాముపై వెనుక నుంచి అతివేగంగా వచ్చి లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. అతడి కుమారుడు జగదీష్ రోడ్డు ప్రక్కన పడడంతో ప్రమాదం నుండి బయటపడ్డాడు. కువైట్ నుంచి ఇటీవలే రాము స్వగ్రామానికి వచ్చాడు. అతడి మరణవార్త విని కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. రామాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కువైట్‌లో వడ్డిపల్లి వాసి మృతి

ఓబులవారిపల్లె : మండలంలోని వడ్డిపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటేష్(45) కువైట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు.. ఆరు నెలల క్రితం అప్పు చేసి జీవనోపాధికై వెంకటేష్ కువైట్‌కు వెళ్లాడు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతుడి భార్య లక్ష్మీదేవి రెండేళ్ల కిందట జరిగిన ప్రమాదంలో కాలు, చేయి విరిగి వికలాంగురాలిగా మారింది. భార్యను కాపాడుకున్న వెంకటేష్ అప్పు తీర్చేందుకు గల్ఫ్ దేశానికి వెళ్లాడు. అతడి మరణంతో ఆ కుటుంబం దిక్కులేని స్థితికి చేరుకుంది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దాతలు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

మదనపల్లె రూరల్ : అప్పుల బాధ భరించలేక.. మనస్తాపం చెందిన చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లె పంచాయతీ గొంగివారిపల్లెకు చెందిన సుబ్బరాము కుమారుడు నరసింహులు(38) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఐదేళ్ల కిందట ఉపాధి కోసం మదనపల్లెకు వచ్చాడు. నీరుగట్టివారిపల్లె చౌడేశ్వరీనగర్‌లో ఉంటూ స్థానికంగా మగ్గం పనులకు వెళుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబ అవసరాల నిమిత్తం పలువురి వద్ద రూ.5 లక్షల వరకు అప్పుచేశారు. తిరిగి చెల్లించలేకపోవడంతో గత కొంతకాలంగా రుణదాతల ఒత్తిడి అధికమైంది. ప్రతి రోజూ ఇంటివద్దకు వచ్చి అప్పు చెల్లించాలని నిలదీస్తుండడంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లోనే సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు బాధితుడిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున నరసింహులు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం



డ్రైనేజీలో నుంచి ఎగిసి పడుతున్న మంటలు, ఆర్పడానికి ప్రయత్నం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎర్రగుంట్ల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ సమీపంలో పెను ప్రమాదం తప్పింది. ఎవరికీ ఎలాంటి ఆపాయం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల వివరాల మేరకు.. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవడంతో హెచ్‌పీ పెట్రోల్ బంకులోని ట్యాంక్‌లోకి నీరు చేరింది. దీంతో వాహన దారులకు పెట్రోల్, డిజిల్ వేయలేదు. ఆయిల్ ట్యాంక్‌కు లీకులు ఉండడంతో పెట్రోల్, డీజిల్ సమీపంలోని డ్రైనేజీ నీటిలో కలిసిపోయింది. దీంతో బంకు నిర్వాహకులు ట్యాంక్ చుట్టూ ఉన్న నీటిని తోడే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే ఒక్కసారిగా డ్రైనేజీ నుంచి మంటలు ఎగసిపడ్డాయి. సిమెంటు దిమ్మెలు పెద్ద శబ్దంతో ఒక పక్క పగిలిపోతుండగా.. మరోవైపు మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. స్థానికులంతా భయంతో పరుగులు తీశారు. సీఐ విశ్వనాథరెడ్డి చేరుకుని బంకు సిబ్బందితో మాట్లాడి మంటలు ఆర్పే ప్రయత్నం చేయించారు. అనంతరం ప్రొద్దుటూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి డ్రైనేజీలలో ఆయిల్‌ను తొలగించడానికి కెమికల్ వాడారు. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడలు రెండో విడతగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యాధికారి టీఎస్‌వీ.వెంకటేశ్వర్లు, చంద్రమోహన్ రాజు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని అండర్19 జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. 27న కడప డీఎస్ఏ, ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్(షటిల్), అక్టోబరు7న మైదుకూరు మేథా డిఫెన్స్ అకాడమీలో అథ్లెటిక్స్, బాల్‌బ్యాడ్మింటన్, 8న పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, టెన్నికాయిట్ పోటీలు ఉంటాయన్నారు.

9న గండిక్షేత్రంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, 10న కడప వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో హాకీ, పవర్‌లిఫ్టింగ్, 11న ఓబులవారి పల్లె ఏపీఎస్ డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో ఖో ఖో, యోగా పోటీలు ఉంటాయని తెలిపారు. 11న చెన్నూరు మండలం రామన్నపల్లె జడ్పీ హైస్కూల్‌లో క్యారమ్స్, చెస్,

12న కోడూరు ఎస్వీ జూనియర్ కళాశాలలో కబడ్డీ, క్రికెట్, 13న చిన్నమండెం ఏపీఎంఎస్ జూనియర్ కాలేజీలో వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు తమ కళాశాల ప్రిన్సిపల్, హెడ్మాస్టర్ జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్, జననతేదీ నిర్ధారణ సర్టిఫికెట్ తీసుకొని వేదికల వద్దకు ఉదయం ఎనిమిది గంటల లోపల హాజరుకావాలని కోరారు.